సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

శుక్రవారం । 1 । మార్చి । 2024



రూ.లక్ష విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో నిత్యాన్నదాన ట్రస్టుకు ఇందుకూరి సీతమ్మ (మలికిపురం మండలం గుడిమెళ్ళంక) గురువారం రూ.లక్ష విరాళం సమర్పించారు.




ఉజ్వల భవితకు వినూత్న బోధన

ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఎంటర్‌ప్రెన్యూరియల్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను అమలు చేస్తున్నారు.

8లో

8,970 క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు గురువారం 8,970 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,650, మధ్య డెల్టాకు 1,720, పశ్చిమ డెల్టాకు 4,600 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.30 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

పవన్ ముమ్మాటికీ చంద్రబాబు దత్తపుత్రుడే..



జిన్నూరి బాబి

అమలాపురం టౌన్: జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ముమ్మాటికీ టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు దత్తపుత్రుడేనని, ఈ విషయాన్ని ఎన్నికల పొత్తు నిర్ణయాలతో మరోసారి రుజువు చేసుకున్నారని ఏపీ అగ్రి మిషన్ సభ్యుడు జిన్నూరి రామారావు (బాబీ) అన్నారు. అమలాపురంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు, పవన్ మధ్య జరిగిన చీకటి ఒప్పందం వెలుగు చూసిందన్నారు. చంద్రబాబు విదిపిన కేవలం 24 సీట్లకే పవన్ సంతృప్తి పడడం, పైపైచ్చు తనను తాను సమర్థించుకుంటూ చేస్తున్న వ్యాఖ్యలపై జనసేన పార్టీ శ్రేణులే చర్చించుకుంటున్నాయన్నారు. ప్రశ్నించటానికే తాను పార్టీ పెట్టానని చెప్పుకునే పవన్.. ఇప్పుడు పొత్తు విషయంలో తీసుకున్న నిర్ణయాలను ప్రశ్నించవద్దని ఆంక్షలు విధించడం ఎంత వరకూ న్యాయమని ప్రశ్నించారు. ప్రశ్నించే స్థాయి నుంచి సమర్థించుకునే స్థాయికి ఆయన దిగజారన్నారు. ముఖ్యమంత్రి జగన్ తల్లి, చెల్లి గురించి మాట్లాడే పవన్ కల్యాణ్.. అసలు తన తల్లి, అక్కతో ఉంటున్నారా అని సూటిగా అడిగారు. జగన్‌ను ఒంటరిగా ఎదుర్కొనే సత్తా లేదనే విషయం వారి పొత్తుతో తేటతెల్లం అవుతోందన్నారు.

సుభద్రకు బంగారు పతకం



గోడి సుభద్ర

మలికిపురం: ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయంలో బుధవారం జరిగిన పవర్ లిఫ్టింగ్ బెంచ్ ప్రెస్ విభాగంలో యూనివర్సిటీ స్థాయిలో మలికిపురం ఎంవీఎన్ జేఎస్ అండ్ ఆర్వీఆర్ ప్రభుత్వం ఎయిడెడ్ డిగ్రీ కళాశాల విద్యార్థిని గోడి సుభద్ర బంగారు పతకం సాధించింది. దీంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ మేరకు గురువారం కళాశాల ఆవరణలో సుభద్రను కళాశాల పాలకవర్గం, అధ్యాపకులు అభినందించారు.

ఎంఎస్‌ఎంఈల పనితీరుపై సర్వే

అమలాపురం రూరల్: సూక్ష్మ, మధ్య తరహా ఎంటర్ ప్రైజెస్ (ఎంఎస్‌ఎంఈ)ల పనితీరును అభివృద్ధి చేయడం కోసం ప్రపంచ బ్యాంకు ఆర్థిక సహకారంతో కేంద్ర ప్రభుత్వం ర్యాంప్ అనే స్కీమ్‌ను ప్రకటించిందని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. ఈ పథకం ఈ నెల 14వ తేదీన జిల్లాలో ప్రారంభించారన్నారు. ఈ నేపథ్యంలో ఎంఎస్‌ఎంఈల ఏకీకృత పోర్టల్‌ను మొదలు పెట్టినట్టు తెలిపారు. జిల్లాలోని అన్ని ఎంఎస్‌ఎంఈలను సర్వే చేయడం కోసం ప్రభుత్వం పరిశ్రమల శాఖ ద్వారా ఉత్తర్వులను జారీ చేసిందన్నారు. దీనిద్వారా తయారీ, సేవ, వాణిజ్య రంగాలలోని అన్ని ఎంఎస్‌ఎంఈలను సర్వే చేసి, వాటిని డిజిటల్ ప్లాట్‌ఫాంలోకి తీసుకువస్తామన్నారు. ఈ సర్వే కోసం ఎంఎస్‌ఎంఈ సర్వే అండ్ సపోర్ట్ అనే మొబైల్ యాప్‌ను రూపొందించినట్టు తెలిపారు. గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పట్టణ ప్రాంతాలలో వార్డు అమెనిటీ సెక్రటరీలు ఈ సర్వేను శుక్రవారం నుంచి మార్చి 20 వరకు నిర్వహించాలన్నారు ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, అడిషనల్ డెవలప్‌మెంట్ కమిషనర్ల ద్వారా ఈ సర్వే పురోగతిని జిల్లా పరిశ్రమల కేంద్రం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో పర్యవేక్షిస్తుందన్నారు.

జగన్ అండగా.. చదువులు సాఫీగా..

- నేడు విద్యాదీవెన నిధుల విడుదల
- బటన్ నొక్కి ప్రారంభించనున్న సీఎం జగన్
- జిల్లాలో 33,500 మంది విద్యార్థులకు రూ.25.80 కోట్ల లబ్ధి
- తల్లుల ఖాతాల్లో నగదు జమ



సాక్షి, అమలాపురం/ రాయవరం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందిస్తున్న జగనన్న విద్యాదీవెన పథకంతో ఉన్నత విద్యను అభ్యసించే ఆర్థికంగా వెనుకబడిన నిరుపేద విద్యార్థులకు భరోసా లభిస్తోంది. ఆర్థిక ఇబ్బందులు లేకుండా చదువు సాగించేందుకు సహాయపడుతోంది. అమ్మ ఒడి పథకం నుంచి జగనన్న విదేశీ విద్య వరకూ పేదలు, సామాన్యులు, మధ్య తరగతి వారి పిల్లల చదువులకు చేయూత అందుతోంది. ముఖ్యమంత్రి జగన్ బడ్జెట్‌లో విద్యకు వేల కోట్ల రూపాయలు కేటాయింపులు చేస్తూ ఎన్నో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ, పేద విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులతో చదువులను మధ్యలో ఆపకూడదనే ఉద్దేశంతో జగనన్న విద్యాదీవెన పథకంతో ఆర్థిక తోడ్పాటునందిస్తున్నారు. దీంతో ఆ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి మంచి ఉపాధి అవకాశాలు పొందే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జగనన్న విద్యాదీవెన పథకం ద్వారా మొదటి విడత పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించనున్నారు. బటన్ నొక్కి విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నగదు జమ చేయనున్నారు.

విద్యార్థులకు లబ్ధి

పాలిటెక్నిక్, డిగ్రీ, ఎంబీబీఎస్, బీటెక్, ఎంటెక్, బీ.ఫార్మసీ, ఎంబీఏ, ఎం.ఫార్మసీ తదితర ఉన్నత కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ (జగనన్న విద్యా దీవెన) అందిస్తున్నారు. విద్యా సంవత్సరంలో ప్రతి త్రైమాసికానికి సంబంధించిన కళాశాలల ఫీజులు ఆ త్రైమాసికంలోనే చెల్లిస్తుండడంతో పేద విద్యార్థులు చదువులు సాఫీగా సాగుతున్నాయి. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి మొదటి విడత జగనన్న విద్యా దీవెన సొమ్మును శుక్రవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కంప్యూటర్ బటన్ నొక్కి విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేయనున్నారు. జిల్లాలో 33,502 మంది తల్లుల ఖాతాలకు రూ.25.80 కోట్ల ఆర్థిక సాయం జమ కానుంది. సీఎం జగన్ బటన్ నొక్కిన తరువాత పది రోజులలో వ్యవధిలో ఈ నిధులు వారి ఖాతాలో జమ అవుతాయి.

జగనన్న విద్యా దీవెన పథకం లబ్ధి ఇలా..

సామాజిక వర్గం	విద్యార్థులు	తల్లుల ఖాతాలు	నిధులు
ఎస్సీ	8,824	7,971	6,14,77,716
ఎస్టీ	188	161	11,30,514
బీసీ	13,413	11,923	10,06,46,912
ఈబీసీ	2,343	2,156	2,22,45,936
ముస్లిం, మైనార్టీలు	319	290	28,18,780
కాపులు	8,275	7,320	6,85,18,007
క్రిస్టియన్	140	126	11,94,165



తల్లుల ఖాతాల్లో జమ

ఐటీఐ చదువుకునే విద్యార్థులకు రూ.పది వేలు, పాలిటెక్నిక్ విద్యార్థులకు రూ.15 వేలు, డిగ్రీ వంటి ఉన్నత చదువులు చదువుకునేవారికి రూ.20 వేల చొప్పున విద్యా దీవెన పథకంలో అందజేస్తున్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఏటా క్రమం తప్పకుండా నాలుగు క్వార్టర్లలో ఈ సొమ్ములు విద్యార్థుల తల్లుల ఖాతాలలో జమ చేస్తున్నారు. ఈ ఏడాది తొలి విడత విద్యా దీవెన సొమ్ములు అందజేయనున్నారు.

ఉన్నత చదువులకు దన్ను

ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించాక విద్యారంగాన్ని పూర్తిగా ప్రక్షాళన చేస్తున్నారు. దేశం యావత్తు అబ్బురపడేలా విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. ఫలితంగా ఇప్పుడు విద్యార్థులు ఎటువంటి చీకూ చింతా లేకుండా చదువులు కొనసాగిస్తున్నారు. సరస్వతీ పుత్రులుగా మారి, విద్యావేత్తలుగా ఎదుగుతూ కుటుంబానికి, సమాజానికి గర్వకారణంగా నిలుస్తున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో అమలు చేస్తున్న పథకాలపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

జగనన్న విద్యాదీవెన పథకం నిధులు ప్రభుత్వం విడుదల చేస్తోంది. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ డబ్బును ఒక వారం లోపు కాలేజీలో చెల్లించాలి. అదే సమయంలో కళాశాలలో అమలవుతున్న సౌకర్యాలు, విద్యార్థుల విద్యాభివృద్ధిపై ఆరా తీయాలి. జవాబుదారీతనం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కళాశాల ఫీజులను విద్యార్థుల తల్లుల ఖాతాలకు జమ చేస్తున్నారు. ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహాన్ని అందుకున్న విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి.

– జ్యోతిలక్ష్మీదేవి, డీడీ, సాంఘిక సంక్షేమ శాఖ, అమలాపురం

రత్నగిరిపై భక్తుల రద్దీ

- సత్యదేవుని దర్శించిన 40 వేల మంది
- రూ.40 లక్షల ఆదాయం



సత్యదేవుని ఆలయం వద్ద క్యూలో నిల్చున్న భక్తులు

అన్నవరం: వందల సంఖ్యలో నవదంపతులు, వేలాదిగా వచ్చిన భక్తజనంతో రత్నగిరి గురువారం కూడా కిటకిటలాడింది. బుధవారం రాత్రి, గురువారం తెల్లవారుజామున సత్యదేవుని సన్నిధిలో పెద్ద సంఖ్యలో వివాహాలు జరిగాయి. ఇవే ముహూర్తాల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వివాహాలు చేసుకున్న వారు కూడా స్వామివారి ఆలయానికి తరలివచ్చారు. ఉదయం 11.30 గంటల ముహూర్తంలో కూడా రత్నగిరిపై వివాహాలు జరిగాయి. ఈ నవదంపతులతో పాటు, వారి బంధుమిత్రులు, ఇతర భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణంలో నవదంపతుల సందడి నెలకొంది.

ఆలయ ప్రాంగణం, క్యూ లైన్లు, వ్రత, విశ్రాంత మండపాలు కూడా నవదంపతులు, వారి బంధుమిత్రులతో కిక్కిరిసిపోయాయి. సుమారు 40 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించి పూజలు చేశారని అధికారులు తెలిపారు. స్వామివారి ఉచిత దర్శనానికి గంట, ప్రత్యేక దర్శనానికి అరగంట సమయం పట్టింది. రెండు వేల వ్రతాలు జరిగాయి. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో ప్రదక్షిణ చేసి రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి పూజలు చేశారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు. ప్రతి గురువారం సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు, శంకరుల మూలవిరాట్టులను సత్యదేవుని నిజరూపంతో దర్శించే అవకాశం కల్పిస్తున్న విషయం తెలిసిందే. ఆభరణాలు లేకుండా తక్కువ పూలమాలలతో స్వామి, అమ్మవార్లను దర్శించుకున్న భక్తులు పులకించిపోయారు.

జగన్ సంక్షేమ పాలనకు ప్రజాదరణ



వైఎస్సార్ సీపీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, మాజీ మంత్రి సూర్యారావు

- ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి
- వైఎస్సార్ సీపీలో టీడీపీ, జనసేన నాయకుల చేరిక

ఆలమూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనకు ప్రజాదరణ పెరిగిందని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆయన పాలనకు ఆకర్షితులై అనేక మంది వైఎస్సార్ సీపీలో చేరుతున్నారన్నారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రతిరోజూ టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారు. ఈ నేపథ్యంలో గురువారం మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాస్, మార్కెట్ వైస్ ప్రెసిడెంట్ దొండపాటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సుమారు వందమంది స్థానిక అభయాంజనేయ అంతర్రాష్ట్ర కూరగాయల వర్తక సంఘం సభ్యులు గోపాలపురంలోని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి నివాసంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారందరికీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, ఇటీవల పార్టీలో చేరిన మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో నల్లా వీరబాబు, తోరాటి రాము, తమ్మన వీర్రాజు, కుంచం పండు, కరాటి శ్రీను, పడాల నాగు, తోట గోపి, తోరాటి రాంబాబు, అన్యం నాగేశ్వరరావు ఉన్నారు. వారు మాట్లాడుతూ అర్హత ఉన్న అందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే జగ్గిరెడ్డి చూపిస్తున్న చొరవకు ఆకర్షితులమై పార్టీలో చేరినట్లు తెలిపారు. విలువలు, విశ్వసనీయతలో అందనంత ఎత్తుకు ఎదిగిన సీఎం జగన్‌కు అన్ని వేళలా అండగా ఉంటామన్నారు. గతంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన చరిత్ర టీడీపీదని విమర్శించారు. బూటకపు హామీలతో ప్రజలను మోసం చేయడానికి చంద్రబాబు సిద్ధమయ్యారని విమర్శించారు.

పంటకోత ప్రయోగాలకు సిద్ధం కావాలి



పంటకోత ప్రయోగాలపై సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఏఓ బోసుబాబు

ఆలమూరు: రబీ సీజన్ తుది దశకు చేరుకుంటున్న తరుణంలో వ్యవసాయశాఖ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది పంట కోత ప్రయోగాలకు సిద్ధం కావాలని జిల్లా వ్యవసాయాధికారి ఓలేటి బోసుబాబు కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక ఏడీఏ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో రబీ సీజన్‌లో 1.68 లక్షల ఎకరాల్లో వరిసాగు జరిగిందన్నారు. అందులో ఎంటీయూ 3626 (బొండాలు) 40 శాతం, ఎంటీయూ 1121 (శ్రీధృతి) 60 శాతం పండించారని తెలిపారు. త్వరితగతిన పక్వానికి వచ్చిన పొలాలను ఈ నెల 15 వరకూ గుర్తించి పంటకోత ప్రయోగాలకు సిద్ధం చేస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా 944 పంటకోత ప్రయోగాలు చేసేందుకు అధికారులకు లక్ష్యం విధించామన్నారు. కాగా.. పంటకోత ప్రయోగాలపై ఆలమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏడీఏ కాకి నాగేశ్వరరావు అధ్యక్షతన ఆలమూరు, కపిలేశ్వరపురం, మండపేట మండలాలకు చెందిన ఏఓలు, ఏఈఓలు, గ్రామ క్షేత్ర సహాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

5న చిట్టబ్బాయి విగ్రహావిష్కరణ



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ, శెట్టిబలిజ నాయకులు

అమలాపురం టౌన్: వైఎస్సార్ సీపీ మాజీ పీఏసీ సభ్యుడు, పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు దివంగత కుడుపూడి చిట్టబ్బాయి విగ్రహాన్ని ఈనెల 5వ తేదీ సాయంత్రం 3 గంటలకు ఆవిష్కరించనున్నారు. ఎంపీ, ఉభయ గోదావరి జిల్లాల వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ మిథున్‌రెడ్డి చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరుగుతుందని పార్టీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర తెలిపారు. విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు మిథున్ రెడ్డి ఈనెల 5వ తేదీ ఉదయం అమలాపురానికి రానున్నారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగనుంది. అమలాపురం గడియారం స్తంభం సెంటర్ సమీపంలో హెడ్ పోస్టాఫీసు వెనుక చిట్టబ్బాయి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గురువారం పార్టీ నాయకులు, శెట్టిబలిజ నాయకులు స్థానిక సూర్యనగర్‌లోని దివంగత చిట్టబ్బాయి ఇంటి వద్ద విగ్రహావిష్కరణ కార్యక్రమ బ్రోచర్లను ఆవిష్కరించారు. పార్టీ నాయకులు, శెట్టిబలిజ నాయకులు, చిట్టబ్బాయి అభిమానులు తరలిరావాలని ఆయన కుమారుడు, పార్టీ నాయకుడు కుడుపూడి భరత్ భూషన్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, మున్సిపల్ కౌన్సిలర్లు గొవ్వాల రాజేష్, చిట్టూరి పెదబాబు, చిత్రపు రామకృష్ణ, దొమ్మేటి రాము, పార్టీ సేవా దళ్ జిల్లా అధ్యక్షుడు మంగళంపల్లి అంజిబాబు, పార్టీ జిల్లా కార్యదర్శి కముజు రమణ, నాయకుడు ఖ్వాజాబాబు పాల్గొన్నారు.

రోడ్ల ఆధునీకరణకు కృషి



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ తదితరులు

- మంత్రి విశ్వరూప్
- అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

అమలాపురం రూరల్: నియోజకవర్గంలోని రోడ్ల ఆధునీకరణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన మండల ప్రజా పరిషత్ భవనం మొదటి అంతస్తు, అభివృద్ధి చేసిన ప్రాంగణాన్ని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, ఎంపీపీ కుడిపూడి భాగ్యలక్ష్మి, ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణితో కలిసి ఆయన ప్రారంభించారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత ఎంపీపీ నిధులైన రూ.46 లక్షలతో వీటిని నిర్మించారు. మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ గ్రామాలలో రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. కోనసీమ జిల్లా ప్రధాన కేంద్రంలో ట్రాఫిక్ రద్దీని అధిగమించే దిశగా నల్ల వంతెన, ఈదరపల్లి వద్ద నూతన వంతెనల నిర్మాణానికి భూమి పూజ చేయనున్నట్టు తెలిపారు. స్వపరిపాలన, గ్రామీణ వ్యవస్థ బలోపేతానికి, అభివృద్ధి కార్యక్రమాల అమలులో గ్రామాల మధ్య సమన్వయానికి మండల పరిషత్ కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పందిరి శ్రీహరి రామ్ గోపాల్, వైస్ ఎంపీపీలు పాలమూరి బాలకృష్ణ, అడపా సుబ్రహ్మణ్యం, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బొంతు గోవిందు శెట్టి, ఎంపీడీవో జె.వెంకటేశ్వరరావు, మండల సచివాలయం కన్వీనర్ చొల్లంగి సుబ్బిరామ్, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి వెంకటేశ్వరబాబు పాల్గొన్నారు.

విద్యార్థీ విజయోస్తు..

- నేటి నుంచి ఇంటర్ పరీక్షలు
- 38 కేంద్రాల్లో పరీక్షలు రాయనున్న 25,256 మంది విద్యార్థులు
- నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు

రాయవరం: ఇంటర్మీడియెట్ పరీక్షలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసింది. శుక్రవారం ప్రథమ, శనివారం ద్వితీయ సంవత్సరం పరీక్షలు మొదలవుతాయి. ప్రశ్నాపత్రాలు, ఓఎంఆర్ షీట్లు, ఇతర మెటీరియల్‌ను ఇప్పటికే పోలీసు బందోబస్తు నడుమ స్ట్రాంగ్ రూమ్‌లకు అధికారులు తరలించారు. పరీక్షల కోసం జిల్లాలో 38 కేంద్రాలను ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల నిఘా నీడలో నిర్వహించే ఈ పరీక్షలకు 25,226 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ పరీక్షలు నిర్వహిస్తారు. ఉదయం 8.30 గంటల నుంచి పరీక్షా కేంద్రంలోకి విద్యార్థులను అనుమతిస్తారు. తొమ్మిది గంటలు దాటిన తర్వాత నిమిషం ఆలస్యమైన పరీక్షా కేంద్రంలోకి విద్యార్థులను అనుమతించబోమని మాధ్యమిక విద్యాశాఖ అధికారులు ఇప్పటికే ప్రకటించారు.

నిఘా నీడలో..

పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌ను అరికట్టేందుకు పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఇందులో రికార్డయ్యే ప్రతి అంశాన్ని ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులు రాష్ట్ర కార్యాలయం నుంచి మానిటరింగ్ చేస్తారు. బాలికలను చెక్ చేసేందుకు ప్రతి కళాశాలలో ప్రత్యేక క్యాబిన్ ఏర్పాటు చేశారు. ప్రతి పరీక్షా కేంద్రం 144 సెక్షన్ అమల్లో ఉంటుంది.

ప్రత్యేక తనిఖీ బృందాలు

38 మంది సీఎస్‌లు, 38 మంది డీవోలు, ఏడు చోట్ల పరీక్షా కేంద్రాల్లో ఏడుగురు అదనపు డిపార్ట్‌మెంటల్ అధికారులు, 550 మంది ఇన్విజిలేటర్ల నియమించారు. 14 స్టోరేజ్ పాయింట్లలో అవసరమైన కస్టోడియన్లను ఏర్పాటు చేశారు. రెండు సిట్టింగ్ స్క్వాడ్స్, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్స్ కూడా ఉన్నాయి. ఫ్లయింగ్ స్క్వాడ్‌లో ఒక డిప్యూటీ తహసీల్దార్, ఒక ఏఎస్సై, ఒక లెక్చరర్ ఉంటారు. సిట్టింగ్ స్క్వాడ్‌లో ఇరువురు అధ్యాపకులు ఉండి అదే సెంటర్‌ను పూర్తిగా పర్యవేక్షిస్తారు. మాస్ కాపీయింగ్‌కు అవకాశం ఉందని భావించిన పరీక్షా కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్స్‌ను నియమిస్తారు. జిల్లాలో 20,269 మంది జనరల్, 4,987 మంది ఒకేషనల్ విద్యార్థులు చదువుతున్నారు. ప్రథమ సంవత్సరం పరీక్షలకు 13,940 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 11,316 మంది హాజరవుతారు. పరీక్షలకు సంబంధించి ఏమైనా సమస్యలుంటే కంట్రోలు రూమ్‌లో ఏర్పాటు చేసిన 95503 35191 నంబరుకు ఫోన్ చేస్తే పరిష్కారానికి చర్యలు చేపడతారు.

లాటరీ ద్వారా పరీక్ష పేపర్లు

ఇంటర్ జనరల్ కోర్సులకు లాటరీ పద్ధతిలో ఒకటి, రెండు, మూడు సెట్లను అదే రోజు నిర్ణయిస్తారు. ఇంటర్మీడియెట్ బోర్డు నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఆ రోజు సెట్‌ను పరీక్షా కేంద్రాలకు కస్టోడియన్లు సీఎస్, డీవోలకు అందజేస్తారు. ఒకేషనల్ పరీక్షలకు మాత్రం లాటరీ పద్ధతి ఉండదు. ఒకే సెట్ పేపరు ఉంటుంది.

వేసవి దృష్ట్యా ఏర్పాట్లు

పెరుగుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకుని పరీక్షా కేంద్రాల వద్ద ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. తాగునీరు, అవసరమైన చోట్ల షామియానాలు ఏర్పాటు చేస్తున్నారు. వైద్య బృందాలతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఇతర మందులను సిద్ధం చేశారు. ప్రతి కేంద్రం వద్ద ఒక ఏఎన్ఎం అందుబాటులో ఉంటారు.



రాయవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బెంచీలపై హాల్ టిక్కెట్లు నంబర్లు వేస్తున్న కళాశాల సిబ్బంది

పక్కాగా నిర్వహణ



పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు పూర్తి చేశాం. ఫీజుల విషయంతో సంబంధం లేకుండా విద్యార్థులందరికీ హాల్ టిక్కెట్లు అందించే ప్రభుత్వం చర్యలు తీసుకుంది. నేరుగా విద్యార్థులే హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయాన్ని కల్పించింది. మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా చర్యలు తీసుకున్నాం.

వనుము సోమశేఖరరావు, డిస్ట్రిక్ట్ ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్, అమలాపురం

క్లుప్తంగా

తలపై పడితే ప్రమాదమే



బీటలు తీసిన పోతిక

అన్నవరం: స్థానిక వీర వేంకట సత్యనారాయణస్వామివారి దేవస్థానంలోని దర్బారు మండపంలో ఒక స్తంభానికి సిమెంట్‌తో రూపొందించిన పోతిక (అలంకరణలో భాగంగా ఏర్పాటు చేసింది) బీటలు తీసింది. అది ఏ క్షణంలోనైనా స్తంభం నుంచి విడిపోయి పడిపోవడానికి సిద్ధంగా ఉంది. దర్బారు మండపంలోని ఉత్సవ మూర్తులను దర్శించుకునేందుకు భక్తులు ఈ స్తంభం కింద నుంచే క్యూలో వెళతారు. గతంలో ఇదే మండపంలో ఇటువంటి పోతిక స్తంభం నుంచి ఊడిపోయి భక్తుల మీద పడడంతో తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి



కృష్ణమూర్తి (ఫైల్)

నల్లజర్ల: కుమార్తెను చూడడానికి వెళుతున్న వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అనంతపల్లి టోల్ ప్లాజా దగ్గర గురువారం ఈ ఘటన జరిగింది. నల్లజర్ల ఏఎస్సై మోహనరావు తెలిపిన వివరాల ప్రకారం.. తాడేపల్లిగూడెం రూరల్ మండలం జగ్గన్నపేటకు చెందిన చవల కృష్ణమూర్తి (55) వ్యవసాయ కూలీ. ఆయన గురువారం తన కుమార్తెను చూడటానికి యాదవోలుకు మోటారుసైకిల్‌పై బయలు దేరాడు. అనంతపల్లి టోల్‌ప్లాజా దగ్గరకు వచ్చేసరికి ఏలూరు నుంచి రాజమహేంద్రవరం వెళుతున్న లారీ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన కృష్ణమూర్తిని హైవే అంబులెన్స్‌లో తాడేపల్లిగూడెం తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

భవితకు చక్కని పునాది



తొమ్మిదో తరగతి విద్యార్థుల భవిష్యత్తుకు ఈఎండీపీ చక్కని పునాది అని చెప్పవచ్చు. మాడ్యూల్స్ మార్గదర్శకాలకు అనుగుణంగా బోధన జరుగుతుంది. భవిష్యత్తు అవకాశాలను ముందే ఊహించడం ద్వారా జీవితంలో నిలదొక్కుకునే వీలుంది. విద్యార్థులు కూడా ఈ కార్యక్రమంలో పూర్తి స్థాయిలో అవగాహన పెంపొందించుకుంటున్నారు.

– ఎం.కమలకుమారి, డీఈవో, అమలాపురం.

ఆలోచనలకు పదును



తొమ్మిదో తరగతి విద్యార్థులకు ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఈఎండీపీ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేశాం. విద్యార్థుల్లో ఉన్న ఆలోచనలకు పదును పెట్టేందుకు ఈ కార్యక్రమం దోహదపడింది. విద్యార్థులు వినూత్న ఆలోచనలకు ఇది వేదికగా నిలుస్తుందనడంలో ఏ మాత్రం సందేహం లేదు. విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటున్నారు.

– వై.నవ్య, ఈఎండీపీ జోనల్ మేనేజర్, అమలాపురం.

అన్ని చర్యలూ తీసుకున్నాం



ఈఎండీపీ ఎక్స్‌పోను విజయవంతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నాం. జిల్లాలో పది ఉత్తమ ప్రాజెక్టులను జిల్లా స్థాయి ఎక్స్‌పోలో విద్యార్థులు ప్రదర్శిస్తున్నారు. ప్రభుత్వం ప్రథమ్ సంస్థతో కలిపి గతేడాది నుంచి ఈఎండీపీ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. పది ప్రాజెక్టుల నుంచి రాష్ట్రానికి రెండు ప్రాజెక్టులు పంపించడం జరుగుతుంది.

– జీవీఎస్ సుబ్రహ్మణ్యం, జిల్లా సైన్స్ అధికారి, అమలాపురం

ఉజ్వల భవితకు వినూత్న బోధన

- పాఠశాలలోనే పారిశ్రామిక, ఆర్థిక పాఠాలు
- తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఈఎండీపీ కార్యక్రమం అమలు
- నేడు కొత్తపేటలో ప్రాజెక్టుల ఎక్స్‌పో



తొమ్మిదో తరగతి విద్యార్థులు (ఫైల్)

రాయవరం: విద్యార్థుల వినూత్న ఆలోచనలకు కార్యాచరణ తోడైతే మెరుగైన ఫలితాలు వస్తాయి. అందుకే విద్యార్థి దశ నుంచే పారిశ్రామిక ఆలోచనలు కల్పించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో 'వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి' అనే కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేసింది. పారిశ్రామిక, ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పిస్తోంది. ప్రస్తుత విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎంటర్‌ప్రెన్యూరియల్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఈఎండీపీ)ను అమలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు నేర్చుకున్న పారిశ్రామిక, ఆర్థిక అక్షరాస్యతపై వారికి ఏ మేరకు అవగాహన కలిగిందో తెలుసుకునేందుకు కొత్తపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రాజెక్టుల ఎక్స్‌పో నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఉదయం తొమ్మిది గంటలకు ఈఎండీపీ ఎక్స్‌పోను జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి, సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఎ.మధుసూదనరావు ప్రారంభిస్తారు.

జిల్లాలో 13,517 మంది విద్యార్థులు

జిల్లాలోని 224 ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో 9వ తరగతి చదువుతున్న 13,517 మంది విద్యార్థులకు ఈఎండీపీ పాఠాలు నిర్వహిస్తున్నారు. ఇందు కోసం తొమ్మిదో తరగతి బోధన చేసే ఉపాధ్యాయులకు శిక్షణ కూడా ఇచ్చారు. ఈ ఉపాధ్యాయులు ప్రతి శుక్రవారం విద్యార్థులకు తరగతులు నిర్వహించారు. ఆర్థిక అక్షరాస్యత బోధనలో భాగంగా బడ్జెట్, పొదుపు, ఖర్చు తదితర అంశాలపై చైతన్యం కలిగించారు. సాంకేతికత, ఇతర ఉత్పత్తులను పరిచయం చేశారు. మొత్తం 18 అంశాల్లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఒక్కో విద్యార్థి ఐదేసి ప్రాజెక్టులను రూపొందించాలి. జిల్లాలోని వివిధ మండలాల పరిధిలో 87 పాఠశాలలకు చెందిన 487 ప్రాజెక్టులను ఆన్‌లైన్‌లో సబ్‌మిట్ చేశారు. వీటి నుంచి పది ఉత్తమ ప్రాజెక్టులను జిల్లాస్థాయి ఎక్స్‌పోకు ఎంపిక చేశారు.

జిల్లా కమిటీ ఏర్పాటు

జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమల కుమారి పర్యవేక్షణలో జిల్లా సైన్స్ అధికారి ఆధ్వర్యంలో నిర్వహించే ఈఎండీపీ ఎక్స్‌పోలో విద్యార్థులు ప్రదర్శించే ప్రాజెక్టుల్లో రెండింటిని రాష్ట్ర స్థాయికి జిల్లా కమిటీ ఎంపిక చేయాల్సి ఉంది. ఇందుకోసం రామచంద్రపురం డీవైఈవో, జిల్లా సైన్స్ అధికారి, డీసీఈబీ కార్యదర్శి, బొమ్మూరు డైట్ లెక్చరర్ కేవీ సూర్యనారాయణ, ఈఎండీపీ జోనల్ మేనేజర్ వై.నవ్య, సమగ్ర శిక్షా ఏఎంవోతో కమిటీని ఏర్పాటు చేశారు.

ఎక్స్‌పోలో ప్రాజెక్టులు ప్రదర్శించనున్న పాఠశాలలు

- కపిలేశ్వరపురం మండలం కాలేరు జెడ్పీ హెచ్‌ఎస్ (ఆటోమేటిక్ డ్రైనేజ్ క్లీనర్)
- అమలాపురం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల (ఎమర్జెన్సీ నేప్‌కిన్ బాక్స్)
- ఆత్రేయపురం మండలం ఉచ్చిలి జెడ్పీ ఉన్నత పాఠశాల (లైఫ్ సేవర్ స్టిక్ ఫర్ స్నేక్ బైట్స్)
- ముమ్మిడివరం మండలం అనాతవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల (బోన్సాయ్ నర్సరీ ప్లాంట్)
- అమలాపురం మండలం పాలగుమ్మి జెడ్పీ హెచ్‌ఎస్ (కోనసీమ టూర్స్ యాప్)
- అమలాపురం మండలం జనుపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల (ఫెర్టిలైజర్ బైయూజింగ్ ఎగ్‌సెల్)
- కొత్తపేట ఉన్నత పాఠశాల (బైండ్ గ్లాస్)
- మండపేట శ్రీ గౌతమి మున్సిపల్ ఉన్నత పాఠశాల (హోమ్ సర్వీస్ ఎక్స్‌ఫర్ట్)
- అంబాజీపేట మండలం జి.అగ్రహారం జెడ్పీ పాఠశాల (రీసైక్లింగ్ కోకోనట్)
- కపిలేశ్వరపురం మండలం టేకి జెడ్పీ ఉన్నత పాఠశాల (సాంబ్రాణి ఎరాడికేటింగ్ మస్కిటోస్).

పెళ్లి రోజే భార్య దారుణ హత్య

- అనుమానంతో నరికి చంపిన భర్త
- కాకినాడలో దారుణం



దివ్య (ఫైల్)



రక్తపు మడుగులో దివ్య మృతదేహం

కాకినాడ క్రైం: వారు ఏడడుగులు నడిచి సరిగాపదేళ్లు పూర్తయ్యింది. లీప్ సంవత్సరంలో పెళ్లి జరగడంతో ఇది రెండో రోజు. అటువంటి ప్రత్యేక సమయంలో భార్యపై ఆ భర్త కిరాతకంగా దాడి చేశాడు. అనుమానంతో కత్తితో నరికి చంపేశాడు. వివరాల్లోకి వెళితే.. కాకినాడ పప్పుల మిల్లు సమీపంలోని శ్రీరామ్ నగర్‌లో బొందల దివ్య(26) భర్త నూకరాజు, ఇద్దరు పిల్లలతో కలిసి జీవిస్తోంది. నూకరాజు రేకులషెడ్ ఫ్యాబ్రికేషన్ వర్కర్‌గా పని చేస్తున్నాడు. మద్యానికి బానిసైన అతడికి భార్యపై అనుమానం ఉండేది. ఈ కారణంతో తరచూ వేధించేవాడు. భార్యతో అకారణంగా గొడవ పెట్టుకోవడం, ఎన్నోసార్లు దాడి చేయడం మామూలు విషయంగా మారింది. ఈ నేపథ్యంలో గురువారం వారి పెళ్లి రోజు. ఉదయం బయటికి వెళ్లి మధ్యాహ్నానికి నూకరాజు ఇంటికి వచ్చాడు. రావడంతోనే భార్యను విచక్షణా రహితంగా కొట్టాడు. ఆ దెబ్బలను తాళలేక దివ్య ఇంటి నుంచి బయటికి పరిగెట్టబోయింది. అప్పటికే తెచ్చి దాచుకున్న కత్తితో ఆమె మెడపై విచక్షణా రహితంగా నరికాడు. రెండే రెండు వేట్లతో దివ్య కుప్పకూలింది. మెడ భాగం నుంచి తల వేరుపడింది. ఘటనా స్థలాన్ని వన్ టౌన్ సీఐ సురేష్ బాబు పరిశీలించారు. కేసు నమోదు చేసి నిందితుడి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

వ్రత పురోహితులకు మెరుగైన ఆరోగ్య సేవలు

- తక్కువ ప్రీమియంతో అందించే కంపెనీతో బీమా చేయించండి
- ఆదేశాలు జారీ చేసిన ఈఓ రామచంద్ర మోహన్



రామచంద్రమోహన్, ఈఓ

అన్నవరం: దేవస్థానంలో పనిచేస్తున్న 260 మంది వ్రతపురోహితుల హెల్త్ ఇన్స్యూరెన్స్‌కు సంబంధించి తక్కువ ప్రీమియంతో ఎక్కువ ఆరోగ్య సేవలు అందించేందుకు ముందుకు వచ్చే కంపెనీతో బీమా చేయించాలని ఈఓ కె.రామచంద్రమోహన్ సంబంధిత అధికారులను గురువారం ఆదేశించారు. మూడు, నాలుగు కంపెనీల కొటేషన్లు తీసుకుని, తక్కువ ప్రీమియంతో వైద్యసేవలు అందించే వారికి ఎంపిక చేయాలన్నారు. ప్రతి సంవత్సరం దేవస్థానం వ్రత పురోహితుల పారితోషకం రిజర్వ్ నిధులతో హెల్త్ ఇన్స్యూరెన్స్ చేయిస్తున్నారు. గతంలో మూడేళ్లు యూని యస్ బ్యాంక్ సౌజన్యంతో మణిపాల్ సిగ్మా కంపెనీతో బీమా చేయించారు. 2021 – 22లో రూ.15 లక్షల ప్రీమియంతో ప్రతి పురోహితుడికి రూ.మూడు లక్షల వైద్య ఖర్చులు ఆసుపత్రికి చెల్లించేలా, ఆసుపత్రి నుంచి డిస్చార్జ్ అయ్యాక మరో రూ.మూడు లక్షలు బఫర్ ఫండ్ నుంచి కంపెనీ చెల్లించేలా ఒప్పందం కుదిరింది. 2023 – 24 సంవత్సరానికి రూ.35 లక్షల ప్రీమియం చెల్లించి వ్రత పురోహితుడితో పాటు అతడి భార్యకు కూడా రూ.ఆరు లక్షల వరకూ వైద్య ఖర్చులు భరించేలా ఇన్స్యూరెన్స్ కంపెనీతో ఒప్పందం చేస్తున్నారు. ఆ ఒప్పందం ఈ ఏడాది ఫిబ్రవరి 14తో ముగిసింది. అయితే 2024–25కి పాత బీమా కంపెనీకి కాకుండా మరో కంపెనీకి రూ.38 లక్షల ప్రీమియం చెల్లించేలా రూ.ఆరు లక్షల వరకు పురోహితుడు, అతడి భార్యకు వైద్య ఖర్చులు భరించేలా ఒప్పందం చేసుకుని ఆ మేరకు పురోహితుల నిధి నుంచి నగదు చెల్లించేందుకు ఈఓకు గురువారం ప్రతిపాదనలు సమర్పించారు. పరిశీలించిన ఈఓ.. ఈ ప్రీమియం ఇంకా తగ్గే అవకాశం ఉంటుందని, మూడు, నాలుగు కంపెనీల నుంచి కొటేషన్లు తీసుకోవాలని ఆదేశించారు.

ప్రైజర్ గ్యాస్ నుంచి మంటలు



గొల్లపాలెంలో ఎగసి పడుతున్న మంటలు

మలికిపురం: గొల్లపాలెంలోని తూర్పుపాలెం గ్యాస్ గేథరింగ్ స్టేషన్‌లో ప్రైజర్ గ్యాస్‌ను మండించే పైపు వద్ద మంటలు గురువారం ఉధృతమయ్యాయి. గ్యాస్‌ను ఇతర ప్రాంతాలకు తరలించే క్రమంలో బ్యాలెన్స్ నిర్వహణలో భాగంగా ప్రైజర్ గ్యాస్‌ను గాలిలో వదిలి మండిస్తారు. ఈ క్రమంలో గురువారం మంటలు ఎక్కువగా వచ్చాయి. ఇది సాధారణ విషయమేనని సైట్ అధికార వర్గాలు తెలిపాయి.

అన్నవరం దేవస్థానం ప్రతిష్టను మరింత పెంచాలి

ఉద్యోగ సంఘ నాయకులకు చైర్మన్, ఈఓ అభినందనలు



దేవస్థానం చైర్మన్ రోహిత్‌ను సత్కరిస్తున్న సంఘ నాయకులు

అన్నవరం: దేవస్థానం ప్రతిష్టను మరింత పెంచేందుకు నూతన ఉద్యోగుల సంఘం నాయకులు కృషి చేయాలని అన్నవరం దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ కె.రామచంద్రమోహన్ కోరారు. ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బుద్దరాజు సత్యనారాయణరాజు (బీఎస్ఎన్ రాజు), ఇతర కార్యవర్గ సభ్యులు గురువారం వారిని మర్యాద పూర్వకంగా సత్కరించారు. అనంతరం ఉద్యోగుల సంఘం నాయకులను చైర్మన్, ఈఓ అభినందించారు. సంఘం గౌరవాధ్యక్షులు డీవీఎస్ కృష్ణారావు, పి.కృష్ణప్రసాద్, టి.వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు కంచిబట్ల రామ్‌కుమార్, అనకాపల్లి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి బి.సత్యశ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ జగన్నాథం, ఎంఎల్ గణపతిరావు, కోశాధికారి పి.తలుపులయ్య, డీఈ బీఎస్ రాంబాబు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కారు అదుపుతప్పి ముగ్గురికి గాయాలు

అమలాపురం రూరల్: వేగంగా వెళుతున్న కారు అదుపు తప్పి దూసుకెళ్లిన ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. అమలాపురం వైపు వెళుతున్న ఓ కారు గురువారం బంగారులంకలో అదుపు తప్పి జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రహరీ పక్క నుంచి దూసుకుపోయింది. ఈ ఘటనలో మోటారు సైకిల్‌పై వస్తున్న ఆదుర్తి వెంకట ఆదిత్య, తోపుడు బండి యజమాని గుబ్బల గంగాధరరావు, పాఠశాల ఆయా కుక్కల కుమారికి గాయాలయ్యాయి. వారికి అమలాపురంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమయంలో విద్యార్థులు పాఠశాల బయట లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఈ సంఘటనపై ఏఎస్సై ఏడుకొండలు కేసు నమోదు చేశారు.

యువకుడి దుర్మరణం

గోపాలపురం: గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి జరిగింది. గోపాలపురం ఎస్సై కర్రి సతీష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మొగల్తూరు మండలం కొత్తకోట గ్రామానికి చెందిన ఏనుగు అంజిబాబు (30) తన మోటార్ సైకిల్‌పై తాడేపల్లిగూడెం నుంచి కొయ్యలగూడెంలో తన స్నేహితుడి ఇంటికి వచ్చాడు. తిరిగి రాత్రి సమయంలో తన స్వగ్రామం కొత్తకోటకు వెళుతుండగా జాతీయ రహదారిపై గోపాలపురం పెట్రోల్‌బంక్ సమీపంలో గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొంది. ఈ ఘటనలో అంజిబాబు అక్కడికక్కడే మృతి చెందాడు.

ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలి



విద్యార్థినికి నగదు బహుమతి అందజేస్తున్న తిరుమల విద్యాసంస్థల చైర్మన్ తిరుమలరావు

రాజమహేంద్రవరం రూరల్: పదో తరగతి, ఇంటర్ విద్యార్థులు పరీక్షల సమయంలో ఏ విధమైన ఒత్తిడి లేకుండా చూసుకోవాలని తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు సూచించారు. తిరుమల విద్యాసంస్థల ఆవరణలో గురువారం ఆ తరగతుల విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. శుక్రవారం ఇంటర్, ఈనెల 18 నుంచి నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ కార్యక్రమం జరిగింది. తిరుమలరావు మాట్లాడుతూ పరీక్షల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. గతేడాది పదో తరగతి, ఇంటర్ ఫలితాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులు అందించారు. డైరెక్టర్ నున్న సరోజినిదేవి, అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపల్ వి.శ్రీహరి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.